క్లుప్తంగా

రావాల్సిన బకాయిలు ఇవ్వాలంటూ నిరసన

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలంటూ చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం వర్షంలోనూ కార్మికులు దీక్షను నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్య పరిష్కరించే వరకూ దీక్షలు కొనసాగిస్తారిని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు నవనీతం, దుర్గాభవాని, ఆశీర్వాదం, గురవయ్య, అంకయ్య, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

మహంకాళేశ్వరికి ఘనంగా పూజలు



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామశివారులోని మహంకాళేశ్వరి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో విశేష హోమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు భవానీమాత తెలిపారు.

నేడు ప్రజా దర్బార్

తాడేపల్లి రూరల్: ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆదివారం ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో ఆదివారం వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి నష్టపోయిన బాధితులకు మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వాటిని టీడీపీ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉండవల్లి హరిజనవాడ కరకట్ట వెంబడి నివాసం ఉండే చైతన్య నివాసం పైకప్పు మొత్తం గాలికి ఎగిరిపోయిందని.. ఆ కప్పు నిర్మించుకునేందుకు లోకేష్ రూ.50 వేలు అందజేశారని అన్నారు. పశువుల పాక కోల్పోయిన మోజెస్‌కు రూ.4 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, నియోజకవర్గ టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు రాయపూడి కిరణ్, గాదె వినయ్, వల్లభాపురం శంకర్, బసివిరెడ్డి, దాసరి కృష్ణ, గాదె శ్రీనివాసరావు, తుపాకుల కోటి, తోట సాంబశివరావు, రాము, ప్రశాంత్, లీలాకృష్ణ, అనిల్, కమలనాథుడు పాల్గొన్నారు.

బత్తుల లక్ష్మమ్మకు ఘన నివాళి



తాడికొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బత్తుల కిషోర్ తల్లి బత్తుల లక్ష్మమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు అన్నారు. ఆదివారం మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ పలువురు నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈదురు గాలులతో ఇబ్బందులు



తాడికొండ: వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి స్థానికులు ఉలిక్కిపడ్డారు. తాడికొండ, తుళ్లూరు మండలాల్లో పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం, ఈదురు గాలులు వీచాయి. దీంతో పలు చోట్ల చెట్లు గాలికి విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించి సరఫరాను పునరుద్ధరణ చేసేందుకు దాదాపు 4 గంటల సమయం పట్టింది. రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులకు వచ్చిన కూలీల ఇళ్ల ముందు వర్షపు నీరు నిలిచి నానా ఇబ్బందులు పడ్డారు. నల్లమట్టి కావడంతో నడిచే దారి బురదమయంగా మారింది.

గ్రంథాలయాలు.. విజ్ఞానానికి మార్గాలు

- జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు
- నియోజకవర్గంలో నాలుగు గ్రంథాలయాల్లో తరగతులు
- వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉపయోగకరంగా పాఠాలు



నూతక్కి శాఖా గ్రంథాలయం

మంగళగిరి: పుస్తకం విజ్ఞానాన్ని అందిస్తుంది. మనకు తెలియని విషయాలను తెలియజేస్తుంది. మాటలు మాట్లాడిస్తుంది. మౌనాన్ని తరిమేస్తుంది. అన్నింటా మనల్ని విజేతలుగా నిలుపుతుంది. అందుకే పుస్తకం ఓ మంచి నేస్తం అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి. పుస్తక పఠనంతో బహుళ ప్రయోజనాలున్నాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుంటే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అన్ని శాఖా గ్రంథాలయాలలోనూ గత నెల 28వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జూన్ 6వ తేది వరకు నిర్వహించే ఈ శిబిరాలల్లో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

100 మందికి పైగా విద్యార్థులు..

5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు ఈ శిక్షణ తరగతులకు హాజరుకావచ్చు. నియోజకవర్గంలో మంగళగిరి, నూతక్కి, తాడేపల్లి, దుగ్గిరాలలో 4 గ్రంథాలయాలున్నాయి. నూతక్కి గ్రంథాలయంలో 1,600కు పైగా సభ్యత్వాలుండగా మంగళగిరిలో 3,700.. తాడేపల్లిలో 2,400.. దుగ్గిరాలలో 1,800కు పైగా సభ్యత్వాలున్నాయి. రోజూ 100 మందికి పైగా విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం చేస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుంటుండగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రవేశ పరీక్షలు రాసేవారు సైతం అత్యధిక మంది గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారు.



చదువుకుంటున్న విద్యార్థులు

ప్రత్యేక తరగతులు..

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు, చిన్నారులతో పుస్తక పఠనం చేయిస్తారు. ఉదయం 10 గంటల వరకు కథలు వినడం, పుస్తక పఠనం, చిన్న కథలు చెప్పించడం, చిత్ర లేఖనం, కథనాలు, సృజనాత్మక నృత్యాలు చేయిస్తారు. 10 గంటల నుంచి 11 గంటల వరకు లూడో, చెస్, పేపర్ ఆర్ట్, క్యారమ్స్ వంటి ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులలో సృజనాత్మకత నైపుణ్యాలను పంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి..

విద్యార్థులకు పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానం లభిస్తుంది. ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులు హాజరుకావచ్చు. పుస్తక పఠనం, కథలు వినడం, ఆటలు, ఇలా ఎన్నో అంశాలు నేర్పిస్తున్నాం. విజ్ఞానంతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చు. గ్రంథాలయంలో పిల్లల నుంచి వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

– ఎస్.నరసింహారావు, గ్రంథాలయ అధికారి, నూతక్కి

ఉచిత చెవి, కంటి పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులో ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(నరసరావుపేట), షేక్.దాదా సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వనివారణ సంస్థ, శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి, ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో 527 మందికి కంటి పరీక్షలు, 237 మందికి చెవి, ముక్కు, గొంతు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ షేక్.మీరావలి మాట్లాడుతూ.. తమ కళాశాల తరుపున ఏటా ప్రజలకు ఉపయోగపడేలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షల్లో 184 మంది కంటి శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ముందుగా షేక్.దాదా సాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జి.చౌడయ్య, జి.శివయ్య, జి.శ్రీనివాసరావు, వైద్యులు షేక్.వశీంమీరా, షహాలీ, శృతి, ఆదిత్య, కళాశాల కరస్పాండెంట్ షేక్, కరీం మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ మస్తాన్ షరీఫ్, హెచ్.గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు, కె.నాగరాజు, వి.నాగరాజులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చిన్నారుల ఈత శిక్షణ శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గోకరాజు గంగరాజు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి, అమరావతి కరకట్ట వెంట ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిన్నారుల ఈత శిక్షణ శిబిరం ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ లైఫ్ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 17 ఏళ్లుగా పిల్లలకు ఏటా ఈతలో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. సుమారు 200 మంది పిల్లలకు ఈతలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఈతతో పాటు బీచ్‌వాలీబాల్, షటిల్, బాడ్మింటన్, వాకింగ్, సైక్లింగ్ తదితర ఎక్సర్‌సైజ్‌ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆక్వా డెవిల్స్‌లో ఈత నేర్చుకున్న చిన్నారులు జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొంటున్నారని గుర్తుచేశారు. అసోసియేషన్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ.. సుమారు 5 వేల మంది పిల్లలకు ఈత నేర్పించామని, పిల్లలకు రోజూ శిక్షణ అనంతరం బూస్ట్ పాలు, గుడ్లు, బిస్కెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వై.వి.రమేష్ కుమార్, కోశాధికారి కె.వి.రామయ్య, కన్వీనర్ చెల్లారి జోజిబాబు, ఉపాధ్యక్షులు గోపాళం సాంబశివరావు, సహాయ కార్యదర్శులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, గుండు జనార్ధనరావు, కె.ఎస్.రామచంద్రరావు, ఎమ్.నరసరాజు, వెంకటరెడ్డి, రాము, సాంబయ్య, కమిటీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా భగీరథ జయంతి



భగీరథుడి చిత్రపటం వద్ద సగరనివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసు బొమ్మ సెంటర్ సమీపంలోని శివాలయంలో భగీరథ జయంతిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర నాయకులు భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గంగను ఆకాశ శిఖరాల నుంచి తీసుకు వచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. లక్ష్య సాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శమని తెలిపారు. అనంతరం ఉండవల్లి సెంటర్‌లో మజ్జిగ పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో సగర నాయకులు కంభం సాయిచంద్, కటారి తిరుపతిరావు, నాగరాజు, ధూపాటి వాసు, నక్క వెంకట సుబ్బారావు, గార్లపాటి దుర్గారావు, గండికోట సోమరాజు, కటారి హరిబాబు, మునలయ్య, వెంకట కృష్ణ, గోపి, సుధీర్, నరసింహ, అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని సగర భగీరథ మహర్షి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి లోకేష్ హాజరైయ్యారు. గౌతమ బుద్ధ రోడ్‌లోని భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పందేటి తిరుపతయ్య, నక్కా బాలకోటేశ్వరరావు, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టి.టి.డి మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

చరవాణి వెలుగులో చదువులు!



మంగళగిరి: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టు వదలని విక్రమార్కుల్లా సమయాన్ని వినియోగించుకుంటున్నారు. తక్కువ సమయం ఉండడంతో ప్రవేశ పరీక్షలు రాసేవారు పట్టుదలతో చదువుతున్నారు. పట్టణంలోని శివాలయం పక్కన గల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న అభ్యర్థులు ఆదివారం ఇలా చరవాణి వెలుతురులో చదువుతూ కనిపించారు. వాతావరణ మార్పుల వల్ల ఈదురు గాలులు, భారీ వర్షం నేపథ్యంలో ఉదయమే కరెంట్ కోత ఎదురయ్యింది. చేసేది లేక పలువురు నిరుద్యోగులు గ్రంథాలయంలో తమ చరవాణి వెలుతురు ఉపయోగించి పుస్తక పఠనాన్ని కొనసాగించారు.

వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

మంగళగిరి టౌన్: వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.దయాకర్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. కూటమి నాయకులు వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని విమర్శించారు. గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కు వడ్డెర వృత్తిదారులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెరలు ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గుంటూరు జిల్లాలో వడ్డెరలు వివిధ ప్రమాదాలకు గురై మృతి చెందారని.. వారి కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పనిచేసే సమయంలో ఎవరైనా మృతిచెందితే వారికి నష్ట పరిహారం కింద రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 8 మంది వడ్డెర వృత్తిదారులతో జిల్లా సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.శంకర్, కార్యదర్శిగా శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా సుబ్బరాయుడు, మరో ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తిదారుల సంఘం కన్వీనర్ ఈమని అప్పారావు తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

మలుపు వద్ద ప్రయాణం.. ప్రమాదం!



ప్రధాన రహదారి పక్కన మలుపు

ఫిరంగిపురం: గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిపై ఫిరంగిపురం శివారులోని రేపూడి చెరువు పక్కన గొల్లపాలెం వెళ్లే రోడ్డు వద్ద మూల మలుపు ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో నరసరావుపేట నుంచి రోడ్డు వైపునకు వచ్చేవారికి మలుపు పక్కన ఉన్న చెరువు గుంత కనిపించడంలేదు. దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల నరసరావుపేట నుంచి వస్తున్న కారు ఆ రోడ్డు వైపునకు తిప్పి మలుపు వద్ద పక్కకు వొరిగిపోయింది. 5 నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ఇక్కడే మృతిచెందారు. గ్రామం నుంచి ప్రధాన రహదారి వైపునకు ద్విచక్రవాహనదారులు రావాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది వాహనాలు రహదారిపై తిరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. రోడ్డుపై కనీసం మలుపును సూచించే బోర్డుకూడా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసి.. గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధార్మిక విద్యతో ఇహ, పర లోకాల సాఫల్యం



తాడేపల్లి రూరల్: ధార్మిక విద్యతో మాత్రమే ఇహ, పర లోకాల సాఫల్యం కలుగుతుందని ఫజీలతుషేక్ మన్సురుద్దీన్ అహ్మద్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలోని జామియా దారుల్ బిర్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ (మదరసా) 15వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మన్సురుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ విద్య రెండు రకాలని.. వాటిలో ఒకటి ప్రాపంచిక విద్య అయితే, మరొకటి ధార్మిక విద్య అని అన్నారు. ధార్మిక విద్యను ఆర్జించడం ప్రతి ముస్లిం తప్పని సరి విధి అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే ప్రాపంచిక విద్యతో పాటు ధార్మిక విద్యను నేర్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అనంతరం షేక్ అబ్దుల్లా షాహిద్, ముర్తుజా, ఇల్యాస్, ఫయాజ్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి జలమయమైన వీధులు



పాత మంగళగిరిలో జలమయమైన వీధి

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. రోడ్లపైనే నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పాటు ఈదురు గాలులు రావడంతో అక్కడక్కడ పలు ప్రాంతాల్లో చెట్లు నేలకు ఒరిగాయి. టిడ్కో గృహ సముదాయంలో పలు బడ్డీకొట్లపై ఏర్పాటు చేసిన రేకులు ఎగిరిపోయాయి. పలు చోట్ల విద్యుత్ వైర్లు తెగడంతో తెల్లవారుజాము నుంచి కొంత సమయం విద్యుత్ సరఫరాను నిలిచివేశారు. పాత మంగళగిరిలోని వీధుల్లోకి డ్రైన్లు నిండి మురుగు నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో దుర్గంధాన్ని భరిస్తూ మురుగులోనే ప్రజలు వెళ్లాల్సి వచ్చింది. అక్కడక్కడ చెత్తా చెదారం పేరుకుపోయి ఉండడంతో నగర వాసులు ఇబ్బందులు పడ్డారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నియోజకవర్గ ఇన్‌చార్జి డైమండ్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయకులు

తాడికొండ: నూతనంగా నియోజకవర్గ అనుబంధ విభాగాలకు ఎన్నికైన నాయకులు పదవులకు వన్నెతెచ్చేలా పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) సూచించారు. ఇటీవల కేంద్ర కార్యాలయం విడుదల చేసిన నియోజకవర్గ అనుబంధ విభాగాల పదవులకు ఎంపికైన పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పూసపాటి వెంకట రామిరెడ్డి, బీసీ బిభాగం మాయకుంట్ల రాయప్ప, చేనేత విభాగం పోలిశెట్టి సాగర్, వాలంటీర్ల విభాగం షేక్ జుబేర్, వికలాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కొమ్మ లింగారావు తదితరులు ఆదివారం ఇన్‌చార్జి డైమండ్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు అలంకారప్రాయం కాదని, పార్టీని బలోపేతం చేయడంలో వారి పాత్ర ఎంతో ఉందని, సమన్వయంతో అందర్నీ కలుపుకొంటూ ముందుకెళ్లి వైఎస్సార్‌సీపీ జెండాను నియోజకవర్గంలో ఎగరేసేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, సీనియర్ నాయకులు అప్పిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, దాసరి జోసఫ్, బి.సాల్మన్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే హక్కులు సాధించుకోవాలి



జెండా ఆవిష్కరణలో సీపీఐ నాయకులు

చినకాకాని(మంగళగిరి): కార్మిక పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలని సీపీఐ నాయకుడు చిన్ని తిరుపతయ్య తెలిపారు. మే డేను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని చినకాకానిలోని ఆయా సెంటర్లలో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల రక్తాన్ని, చమటను పెట్టుబడి దారులకు ప్రధాని మోడీ దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తులకు రాయితీ ఇస్తూ పేద, మధ్య తరగతి వర్గాలపై మోయలేని భారం మోపుతున్నారని విమర్శించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, జూట్రూ శంకరరావు, కఠారి జేసుదాసు, యార్లగడ్డ అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

లక్ష్మీపురం: షుగర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆరోగ్యం గురించి సోషల్ మీడియాలో వచ్చే వివిధ రకాల దుష్ప్రచారాలను నమ్మరాదని, సరైన వైద్యుడిని కలిసి మందులు వాడుకోవాలని కోరారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, వాణిజ్య వేత్త బాదం బసవ గుప్త, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె.చంద్రశేఖరరావు ప్రసంగించారు.

యోగాతో మానసిక ప్రశాంతత



తెనాలి అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ ఆంజనేయ యోగా కేంద్రం వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ పేర్కొన్నారు. యోగా కేంద్రం ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన చిన్న పిల్లల యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో ఎక్కువ మంది మానసిక ఒత్తిడితో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అనేక శారీరక రుగ్మతల నిర్మూలనకు యోగా దోహదపడుతుందని చెప్పారు. అనంతరం దాత విక్రమ్ సహకారంతో చిన్నారులకు ఆట వస్తువులు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంత లక్ష్మి, సూర్యనారాయణ, సుబ్బారావు, రేఖ, కోమల, రాంబాబు, మధు, సంపూర్ణ పాల్గొన్నారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి

రూ.57 వేలు అపహరణ

మంగళగిరి టౌన్: ఏటీఎం సెంటర్ వద్దకు డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన వ్యక్తి కార్డు మార్చి.. అతన్ని ఏమార్చి డబ్బులు కాజేసిన కేటుగాడి వ్యవహారం మంగళగిరి పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని నిడమర్రుకు చెందిన మండేపూడి మణికుమార్ కిరాణాషాపు నడుపుతున్నారు. ఈనెల 1న సరుకుల కొనుగోలు నిమిత్తం మంగళగిరికి వచ్చాడు. గౌతమ బుద్ధ రోడ్‌లో ఉన్న ఓ ఏటీఎం వద్దకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డబ్బులు డ్రా చేసే క్రమంలో రూ.20 వేలను నగదును మిషన్‌లో ఎంటర్ చేశాడు. ఇదే సమయంలో అతని వెనుక ఉన్న వ్యక్తి మణికుమార్ నమోదు చేసిన పిన్ నెంబర్‌ను గమనించాడు. అనంతరం 'డబ్బులు డ్రా చేసేందుకు ప్రాసెస్ మారింది.. మీకు తెలియదా' అంటూ మాట కలిపాడు. బ్యాంక్ సిబ్బంది అనుకుని ఆ వ్యక్తితో తనకు తెలియదంటూ చెప్పాడు. డబ్బులు డ్రా చేయాలంటే మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది చూడండి అంటూ ఏటీఎం స్క్రీన్ ముందుకు సదరు వ్యక్తి వచ్చాడు. మణికుమార్ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని తప్పుగా ఎంటర్ చేసి డబ్బులు రావడం లేదంటూ నమ్మబలికాడు. అనంతరం మణికుమార్‌ను నమ్మించేందుకు మినీ స్టేట్‌మెంట్ ప్రింట్ తీసి మీ డబ్బులు ఎక్కడకు పోలేదు.. ఖాతాలోనే ఉన్నాయన్నారు. ఈ క్రమంలో మణికుమార్ ఏటీఎం కార్డును తన జేబులో పెట్టుకుని తన దగ్గర ఉన్న అదే బ్యాంకుకు చెందిన మరో ఏటీఎం కార్డును మణికుమార్‌కు ఇచ్చాడు. కార్డు మారిన విషయం గమనించని మణికుమార్ అక్కడి నుంచి వెనుదిరిగాడు. 10 నిమిషాల తరువాత డబ్బులు విత్‌డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో హడావుడిగా బ్యాంక్ ఏటీఎం వద్దకు వచ్చి ఆ వ్యక్తి కోసం వెతికాడు. కనిపించకపోయే సరికి తాను మోసపోయానని గ్రహించాడు. ఈలోపే ఓ ప్రైవేటు బ్యాంక్ ఏటీఎం నుంచి వరుసగా నాలుగు దఫాలుగా రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. మరుసటి రోజు మరలా రూ.10 వేలు, రూ.7 వేలు మరోసారి డ్రా చేసినట్లు మెసేజ్‌లు రావడంతో ఆదివారం మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.